సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. 8లో ▸



శ్రీవారి క్షేత్రంలో 'ఉట్టి' ఉత్సవం

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని చినవెంకన్న దివ్య క్షేత్రంలో మంగళవారం జరిగిన ఉట్లు పండుగ, శ్రీవారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. 8లో ▸



ఉద్యాన పంటల్లో సస్యరక్షణ

అధిక వర్షాల నేపథ్యంలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో వెలుగు కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: వీవోఏల సమస్యలు పరిష్కరించాలంటూ భీమవరం వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి పీవీ ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వీవోఏలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందన్నారు. స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం ద్వారా వారికి రుణాలు అందించే ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్న వీవోఏలు కేవలం సభల జన సమీకరణ విషయంలోనే గుర్తుకు వస్తున్నారని దుయ్యబట్టారు. వీవోఏలకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయు జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ పాలకులు చెప్పుకుంటున్నట్లు రాష్ట్రంలో ప్రభుత్వ పాలన గొప్పగా ఉంటే ప్రజలు రోడ్డెక్కి ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి నిర్మలాదేవి తదితరులు మాట్లాడారు. అనంతరం వెలుగు పీడీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఇంజేటి శ్రీనివాస్, వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగిడి గోవిందమ్మ, జి.లక్ష్మి, ఎ.సుబ్బలక్ష్మి, పుష్పలత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్‌పై కక్ష సాధింపా?

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కండక్టర్ వై.కుసుమ కుమారికి మంగళవారం విధులు కేటాయించలేదు. ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన తరువాత బస్సుల్లో మహిళలు పరిమితికి మించి ప్రయాణించడంతో కండక్టర్లు పడుతున్న ఇబ్బందులపై కుసుమకుమారి ఒక వీడియోలో తన ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆర్టీసీ అధికారులు విచారణ చేపట్టినట్టు తెలిసింది. విచారణ పూర్తయ్యేవరకు విధులు కేటాయించకూడదని నిర్ణయించినట్టు సమాచారం. మంగళవారం డిపోలో ఆమెను విచారణ చేసిన అధికారులు.. ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి నివేదిక తీసుకున్నట్టు తెలిసింది. ఆ నివేదికను ఆర్టీసీ ఉన్నతాధికారులకు పంపించనున్నట్టు సమాచారం.

ఐటీఐ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: జిల్లాలోని ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంటలోని రెండు ప్రభుత్వ ఐటీఐల్లో మిగిలిపోయిన సీట్ల కోసం ఈ నెల 27 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ డీ ఆనంద్ వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. ఈ నెల 29న నిర్వహించే కౌన్సెలింగ్ సమయంలో రసీదు తప్పనిసరిగా చూపించాలన్నారు. 8వ తరగతి పాస్, పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం వెల్డర్ ట్రేడ్‌లో అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9666407468 నెంబరులో సంప్రదించాలన్నారు.

వేగా జ్యువెలర్స్ ఆషాఢం విజేతలు



వేగా జ్యువెలర్స్ షోరూమ్‌లో లక్కీ డ్రా నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేగా జ్యువెలర్స్ ఏలూరు షోరూంలో ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించిన లక్కీడిప్‌లో గెలుపొందిన విజేతల పేర్లను మంగళవారం ప్రకటించింది. లక్కీ డ్రాలో జగ్గవరానికి చెందిన వి.వీరభద్రరావు, ఏలూరుకు చెందిన ఎస్.సతీష్‌కుమార్, జి.రమేష్, దుగ్గిరాలకు చెందిన వి.సత్యప్రియ, ఏలూరుకు చెందిన బి.శారద గెలుపొందారని తెలిపింది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ వనమా మాట్లాడుతూ ఆఫర్ల కాలంలో ఆభరణాలు కొనుగోలు చేసిన ఖాతాదారులకు లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటిస్తున్నామని చెప్పారు. అనంతరం విజేతలకు రూ.2 లక్షల విలువైన బంగారు/డైమండ్ నెక్లెస్‌లు బహుమతిగా అందజేశారు. వేగా జ్యువెలర్స్ అన్ని షోరూంలలో రాబోయే దసరా, దీపావళి పండుగలకు, వివాహ వేడుకల కోసం సరికొత్త డిజైన్ల ఆభరణాలను విస్తృత శ్రేణుల్లో అందుబాటులో ఉంచినట్టు సంస్థ ప్రతినిధి తెలిపారు.

కుండపోత వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన జనజీవనం
- జిల్లాలో 20 మి.మీ వర్షపాతం నమోదు
- అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 62.4 మి.మీ వర్షం



నౌడురు వద్ద చెరువును తలపిస్తున్న వీరవాసరం-బ్రాహ్మణచెరువు రోడ్డు

సాక్షి, భీమవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. మంగళవారం ఎడతెరిపిలేకుండా కుండపోతగా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో జనజీవనం స్తంభించింది. జిల్లా వ్యాప్తంగా 41.6 మి.మీ వర్షపాతం నమోదుకాగా అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 62.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో మొదలైన వర్షం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా పడుతూనే ఉంది. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. తాడేపల్లిగూడెం, ఆచంట, భీమవరం, తణుకు నియోజకవర్గాల్లో భారీగా మిగిలిన చోట్ల మోస్తరుగా వర్షం కురిసింది. పెనుమంట్ర ప్రాంతంలో 59.4 మి.మీ వర్షం కురవగా, ఇరగవరంలో 48.6, గణపవరంలో 36.4, పెంటపాడులో 35.6, భీమవరం, ఉండిలో 25.6 మి.మీ చొప్పున, తణుకులో 24.4, పెనుగొండలో 21.2, అత్తిలిలో 13.2 మి.మీ వర్షం కురిసింది. తెరిపివ్వకుండా వర్షం పడడంతో అధిక శాతం మంది ఇళ్లకే పరిమితం కాగా విద్యాసంస్థలు, ఆఫీసులకు వెళ్లేవారు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జనం లేక మార్కెట్లు వెలవెలబోయాయి. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు ఆర్టీసీ బస్టాండుల వద్ద మోకాలు లోతు నీటితో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రోడ్లపై గోతులు కనిపించక పలుచోట్ల ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలు పాలయ్యారు.

భీమవరంలో నీట మునిగిన రోడ్లు

భీమవరంలో ఉదయం 6 గంటలకు వర్షం చినుకులుగా ప్రారంభమై తరువాత సుమారు మూడు గంటల పాటు ఎడతెరపిలేకుండా భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని హౌసింగ్ బోర్డు, బ్యాంక్ కాలనీలు, ఏఎస్ఆర్ నగర్, మెంటేవారితోట, నాచువారిసెంటర్, గునుపూడి, ఫైర్‌స్టేషన్ ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా రోడ్ల పక్కన తోపుడు బండ్ల వ్యాపారం చేసుకుని జీవించే చిరువ్యాపారులు నష్టపోయారు. పట్టణంలోని గరగపర్రు రోడ్డు, మెంటేవారితోట, ఎఫ్‌సీఐ తదితర ప్రాంతాల్లోని రైల్వే అండర్‌పాస్‌ల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వీరవాసరం – వడ్డిగూడెం వెళ్లే ప్రధాన రహదారిపై రెండు భారీ వృక్షాలు పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పలుచోట్ల విద్యుత్ స్తంభాలు గాలికి ఒరిగిపోయాయి.



భీమవరంలో జలమయమైన బస్టాండు రోడ్డు

- పాలకొల్లు పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ, బస్టాండ్ సెంటర్, సలాదివారి తోట, బంగారువారి చెరువుగట్టు, బ్రాడీపేట తదితర చోట్ల రోడ్లు జలమయమయ్యాయి. బస్టాండ్‌లో మోకాలులోతు నీటితో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- పెనుగొండ, ఆచంట, పెనుమంట్ర, పోడూరు మండలాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం పడడంతో రోడ్లన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. పెనుగొండ, గటాలదిబ్బ, సిద్ధాంతంలో జగనన్న కాలనీలు జలమయం కావడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.
- ఇరగవరం మండలంలో కత్తవపాడులోని ఎస్సీ కాలనీ, రేలంగిలోని ఇందిరానగర్‌లు జలమయమయ్యాయి. ఇరగరవరం మెయిన్‌రోడ్డులో డ్రెయినేజీ పనులు జరుగుతుండంతో ఇళ్ల ముందు వర్షపు నీరు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఇరగవరం గొంతేరు డ్రెయిన్‌లో గరిగమ్మలకాలువ, పేకేరులో నక్కల కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి.
- తాడేపల్లిగూడెంలో తెల్లవారుజామునుంచి భారీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా 62.4 మి.మీ. భారీ వర్షపాతం నమోదైంది. దీని వల్ల పట్టణంలోని రహదారులు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరింది. తాడేపల్లిగూడెం మండలం మెట్ట ప్రాంతాల్లోని వరికోతలకు విఘాతం ఏర్పడింది.



వరద నీటిలో తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం



తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



వీరవాసరం మండలం రాయకుదురులో కాలువను తలపిస్తున్న రోడ్డు

ఉపాధ్యాయుల నిరసన



కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

భీమవరం: ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్)ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండేళ్లు పూర్తయిపోయినా పీఆర్సీ కమిషన్ వేయకపోవడం శోచనీయమని వెంటనే కమిషన్ వేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, కేంద్రం మెమో నెంబర్ 57 ప్రకారంగా 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు పీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

22న చలో అసెంబ్లీ

భీమవరం: కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టినట్లు ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉందుర్తి శ్రీనివాస్, మామిడిశెట్టి రామాంజనేయలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు, పంటకు పెట్టుబడి సాయం ఇవ్వాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చేలా ప్రభుత్వం తయారు చేసిన ముసాయిదా చట్టాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించి అమలు చేయాలని, కౌలురైతులందరికీ పంట నమోదు ఆధారంగా పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నూతన కౌలు చట్టాన్ని తీసుకొస్తామని హామి ఇచ్చినా గత చట్టాన్నే అమలు చేయడం దారుణమన్నారు. కులాలతో సంబంధంలేకుండా కౌలురైతులందరికీ పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వమే వైద్య కళాశాలలు నడపాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి డిమాండ్



దగ్గులూరు మెడికల్ కళాశాలను సందర్శించిన సీపీఎం నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడమంటే విద్యను వ్యాపారం చేయడమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎస్‌వి గోపాలన్ మండిపడ్డారు. మంగళవారం దగ్గులూరు మెడికల్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వమే వైద్య కళాశాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాడు మెడికల్ కళాశాల నిర్మాణం కోసం 60 ఎకరాల భూమిని కొనుగోలు చేశారని తెలిపారు. ల్యాండ్ ఫిల్లింగ్ పూర్తిచేసి ఫౌండేషన్ ప్రాథమిక స్థాయిలో ఉందన్నారు. ప్రభుత్వం మారడంతో పనులు ఆగాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు సంవత్సరంన్నర కావస్తున్నా ఇంతవరకూ నిర్మాణం పనులు కొనసాగించలేదన్నారు. ప్రైవేటు వాళ్లకు అప్పగించడం అన్యాయమన్నారు. ఇప్పటికే విద్యారంగం ప్రైవేటు పరమైందని, దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నారన్నారు. ప్రభుత్వమే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూడడం దారుణన్నారు. దీనివల్ల విద్య మరింత ఖరీదుగా మారుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వమే కళాశాలలను నడపాలని లేదంటే ప్రజా ఉద్యమం లేవనెత్తుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కానేటి బాలరాజు, జవ్వాది శ్రీనివాస్, బాతిరెడ్డి జార్జి, కె క్రాంతిబాబు, గొల్ల ఏడుకొండలు, టి.శ్రీనివాస్, ఎస్.మాణిక్యం, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా జోన్ సర్వే పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఆక్వా జోన్ సర్వేను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆక్వా జోన్ సర్వేపై జిల్లాలోని మత్స్య శాఖ అధికారులతో సమీక్షించారు. అన్ని మండలాల్లో సర్వే పూర్తి చేసి నివేదికలు అందజేస్తామన్నారు. జిల్లాలో 1,32,562.72 ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా సాగు చేస్తున్నారని, వీటిలో 1,04,792.5 ఎకరాలు మాత్రమే ఆక్వా జోన్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. ముంపు, తక్కువ సారం కలిగిన వ్యవసాయ భూములు, ఆక్వా చెరువుల చుట్టూ వున్న భూముల్లో ఆక్వా సాగు అనుకూలంగా మరో 6,540 ఎకరాలను సర్వేలో గుర్తించారన్నారు.

కొనసాగుతున్న గోదావరి ఉధృతి

పోలవరం రూరల్: రెండు నెలలుగా గోదావరి వరద పెరుగుతూ తగ్గుతూ ఒకే విధంగా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలకు నదిలోకి నీరు చేరడంతో వరద ఉధృతి కొనసాగుతోంది. పోలవరం స్పిల్ వే వద్ద 31.6 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. 48 గేట్ల నుంచి 7.69 క్యూసెక్కుల వరద దిగువకు చేరుతోంది. దిగువన వరద ప్రవాహం ఇంకా కొనసాగుతోంది. భద్రాచలం వద్ద సోమవారం 40 అడుగులకు చేరుకున్నప్పటికీ మంగళవారం సాయంత్రానికి 37.70 అడుగుకుల నీటి మట్టం చేరుకుంది.

కైకలూరులో కొల్లి అరాచకం

- కామినేని అండతో రెచ్చిపోతున్న వైనం
- కూటమి అధికారంలోకి వచ్చాక దందాలు, దాడులు
- దానిగూడెం దళితులపై దాడి ఘటనలో కొల్లి కీలక సూత్రధారి
- 12 రోజుల పరారీ తరువాత లొంగిపోయిన వైనం
- కామినేని డైరెక్షన్‌తోనే పోలీసుల ఎదుట లొంగుబాటు!
- బయటకు వచ్చాక కొల్లి బాబి 2.0 చూపిస్తానంటూ బెదిరింపులు



మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే కామినేనితో కొల్లి బాబి(ఫైల్)



పవన్ కల్యాణ్, కామినేని శ్రీనివాస్‌తో కొల్లి బాబి(ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అధికార పార్టీ నేత కొల్లి బాబి అరాచకాలకు తాత్కాలిక బ్రేక్ పడింది. మాజీ మంత్రి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అండదండలతో పేట్రేగిపోతున్న బాబి దళిత ఉద్యమంతో దిగొచ్చాడు. దాడులు, దౌర్జన్యాలు, దందాలతో నిత్యం వివాదాస్పద వ్యక్తిగా ఉండే బాబి తాజాగా కైకలూరు మండలం దానిగూడెంలో దళిత యువకులపై దాడిలో కీలక వ్యక్తి. ఘటన జరిగాక పోలీసులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దళిత సంఘాలు రోడ్డెక్కి తీవ్ర ఆందోళనకు దిగాయి. కామినేని డైరెక్షన్‌లో పరారైన కొల్లి 12 రోజులు తరువాత ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో లొంగిపోయాడు. జనసేన కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి షాడో ఎమ్మెల్యే తరహాలో కైకలూరులో ప్రతి వివాదానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాడు. కైకలూరుకు చెందిన కొల్లి వరప్రసాద్ అలియాస్ బాబి జనసేనలో క్రియాశీలక కార్యకర్తగా కొనసాగుతూ గత ఎన్నికల్లో నియోజకవర్గంలో జనసేన ఎలక్షన్ ఇన్‌చార్జిగా పనిచేశాడు. పేరుకే జనసేన అయినప్పటికీ 24 గంటలూ ఎమ్మెల్యే కామినేని వెంటే ఉంటూ దందాలు కొనసాగించాడు. గతంలోనూ కొల్లి బాబిది వివాదాస్పద వైఖరి.

దళితుల ఉద్యమంతో లొంగుబాటు

ఈ నెల 5న కైకలూరు శివారులోని దానిగూడెం దళితవాడలో ఇద్దరు యువకులపై జనసేన కార్యకర్తలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ కేసులో 8 మందిని అరెస్టుచేశారు. ప్రధాన సూత్రధారిగా ఉన్న కొల్లి బాబి.. కామినేని డైరెక్షన్‌తో పరారయ్యాడు. దళితులు రోడ్డెక్కి ఆందోళన చేయడం, సామాజిక వర్గాల పోరుగా మారడం, ఇతర ప్రాంతాల నుంచి దళిత సంఘాలు కీలక నేతలు వచ్చి పరామర్శించి పోలీసుల తీరుపై మండిపడుతున్న క్రమంలో 12 రోజులుగా పరారీలో ఉండి మంగళవారం మధ్యాహ్నం ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో లొంగిపోయాడు. లొంగిపోవడానికి ముందు సోషల్ మీడియాలో ప్రత్యేకంగా వీడియో పోస్టు చేశాడు. బయటకు వచ్చిన తరువాత కొల్లి బాబి 2.0 చూపిస్తానని, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు సంగతి తేలుస్తానంటూ బెదిరింపులకు దిగడం గమనార్హం.

7 చీటింగ్ కేసులు, 3 చెక్‌బౌన్స్ కేసులు

పదేళ్ళ క్రితం అటవీశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తూ కృష్ణా, ఏలూరు జిల్లాల్లో అటవీ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ 25 మందికిపైగా మోసం చేసి డబ్బులు వసూలు చేసిన ఘటనలో అతనిపై కేసు నమోదైంది. సుమారు 7 చీటింగ్ కేసులు, 3 చెక్‌బౌన్స్ కేసులున్నాయి. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో ఏ–2గా కొల్లి ఉన్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన సమయంలో కైకలూరులో చెలరేగిపోతాడు. గతేడాది కూటమి అధికారంలోకి రాగానే మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు హయాంలో చేసిన పనులకు సంబంధించిన శిలాఫలకాల తొలగింపుతో దౌర్జన్యకాండ మొదలుపెట్టాడు. మార్చి 27న కైకలూరు వైస్ ఎంపీపీ ఎన్నిక సందర్భంగా భుజబలపట్నంలో ఎంపీటీసీ ఇంటి వద్ద జరిగిన ఘర్షణను చిత్రీకరిస్తున్న స్థానిక జర్నలిస్టు కురెళ్ళ కిషోర్‌పై బాబి, అతని అనుచరులు దాడి చేశారు. ఆ తరువాత టీడీపీకి చెందిన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పైడిమర్రి మాల్యాద్రి కార్యాలయంపై జరిగిన దాడి కొల్లి డైరెక్షన్‌లో జరిగినట్లు ఆరోపణలున్నాయి. కైకలూరులో కాల్‌మనీ కేసులో దంపతులపై దాడి, ఫ్లెక్సీ ప్రింటింగ్ డబ్బులు అడిగినందుకు షాపు యజమానిని భయపెట్టిన సంఘటన, మార్కెట్ సమీపంలోని ఓ ఎలక్ట్రికల్ షాపుపై దాడి చేసి షాపు తాళాలు వేసిన ఘటన ఇలా చాలా ఘటనల్లో అతని ప్రమేయముంది. ప్రేమ పెళ్లి చేసుకుని తిరిగి వస్తున్న ప్రేమ జంటపై దాడి చేయడం, అయ్యప్ప మాలలో ఉన్న వ్యక్తిపై దాడి ఘటన, ఏలూరుకు చెందిన జర్నలిస్టు ఉర్ల శ్రీనివాస్ కారును అవసరాలకు తీసుకుని అమ్మేసిన ఘటన, సంతమార్కెట్ వద్ద విశ్రాంత రైల్వే ఉద్యోగిపై దాడి ఇలా అనేక ఘటనల్లో కీలక వ్యక్తి. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కామినేని అండతో అక్రమ మైనింగ్, మద్యం విక్రయాలతో పాటు పేకాట శిబిరాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటాడు.

క్లుప్తంగా

క్రికెట్ జట్టు ఎంపిక వాయిదా

ఏలూరు రూరల్: ఈ నెల 18వ తేదీన భీమవరం డీఎన్ఆర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్–14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు అధిక వర్షాల కారణంగా వాయిదా వేసామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా త్రిసభ్య కమిటీ సభ్యుడు ఎస్కే షాకిర్‌హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి ఎంపిక తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

ఎలుకల మందు తిని మహిళ మృతి

ఆకివీడు: ఎలుకల మందు తిని ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం కలిదిండి మండలం ఇవరంపాడు గ్రామానికి చెందిన స్వాతికి రెండేళ్ల కిందట వివాహమైంది. భర్తతో గొడవపడి మరో వ్యక్తితో సహజీవనం గడుపుతున్న ఆమె స్థానిక పెద్దపేటలో నివసిస్తోంది. ఈనెల 10వ తేదీన ఎలుకల మందు తిని అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆకివీడు ఆ తరువాత ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మద్యం తాగి .. పడమరలాకుల్లో పడి



ప్రసాద్ మృతదేహం

ఏలూరు టౌన్: ఓ వ్యక్తి అధికంగా మద్యం తాగి ప్రమాదవశాత్తు పడమరలాకుల్లో పడి మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రూరల్ గ్రీన్‌సిటీ ప్రాంతానికి చెందిన కోట్ల ప్రసాద్(48) కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. ప్రసాద్‌కు వివాహం కాలేదని చెబుతున్నారు. మద్యానికి బానిసగా మారిన ప్రసాద్ 16తేదీ మధ్యాహ్నం అధికంగా మద్యం సేవించి పడమరలాకుల వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కొత్తూరు జూట్‌మిల్లు కాజ్‌వే ప్రాంతంలో మంగళవారం అతడి మృతదేహం లభించింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ముద్దాయికి జైలు

కామవరపుకోట, ఏలూరు (టూటౌన్): హత్య కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. తడికలపూడి ఎస్సై పి.చిన్నారావు తెలిపిన వివరాల ప్రకారం 2024 సంవత్సరంలో రావికంపాడు గ్రామంలోని రామాలయం ఎదురుగా ఉన్న మండపంలో ఇస్సాక్ అనే వ్యక్తి మద్యం సేవించి నిద్రించాడు. లేచిన తరువాత తన ఫోన్ కనిపించకపోవడంతో అక్కడే నిద్రించి ఉన్న అదే గ్రామానికి చెందిన మద్దిపట్ల నాగేశ్వరరావును సెల్ ఫోన్ తీసావా అని అడగడంతో వారి ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అనంతరం నిందితుడు నాగేశ్వరరావు పాత గొడవల నేపథ్యంలో ఇస్సాకుపై కక్ష పెంచుకుని అక్కడే ఉన్న కర్రతో ఇస్సాకును కొట్టి తీవ్రంగా గాయపరచడంతో అతను మృతి చెందాడు. దీనిపై అప్పటి తడికలపూడి ఎస్సై ఎం.జయబాబు కేసు నమోదు చేసి నిందితుడు నాగేశ్వరరావును అరెస్ట్ చేశారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు, చింతమనేని రమేష్ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ఏలూరు ఐదవ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ ముద్దాయి నాగేశ్వరరావుకి నాలుగేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై చెన్నారావు తెలిపారు.



పత్రికా స్వేచ్ఛకు విఘాతం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పత్రికా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా కేసులు నమోదు చేయడం దారుణం. జర్నలిస్టులపైనే కాకుండా ఎడిటర్లపై కూడా కేసులు పెట్టడానికి కూటమి సర్కారు వెనుకాడడం లేదు. ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక పత్రికలపై దాడికి తెగబడుతున్నారు.

– కంభం విజయరాజు, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్

అక్షరాలకు సంకెళ్లు వేయడమే!



పత్రికా స్వేచ్ఛను హరించడం, అక్షరాలకు సంకెళ్లు వేయడం నిరంకుశత్వ పాలనకు నిదర్శనం. పత్రికల్లో వచ్చిన వార్తల్లో లోపాలుంటే వివరణలతో సరిదిద్దుకోవాలి. సమాజంలో జరిగే విషయాల్ని నిర్భయంగా తెలియజేసే హక్కు పత్రికలకు, పాత్రికేయులకు ఉంది. సాక్షి కథనాలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తగదు. కేసులు పెట్టి పాత్రికేయుల్ని భయపెట్టి వాస్తవాల్ని మరుగున పెట్టాలనుకోవడం మూర్ఖత్వం.

– పీవీఎల్ నర్సింహరాజు, వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక శుభలేఖ కళ్యాణ మండపంలో విద్యుత్ ఉద్యోగుల జేసీ రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ కార్మిక సంఘాలు గతంలో ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డిస్ట్రిబ్యూషన్ కంపెనీల యాజమాన్యం కార్మిక చట్టాలకు, విద్యుత్ బోర్డ్ విభజనకు ముందు ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న త్రైపాక్షిక ఒప్పందానికి విరుద్ధంగా గత ఆరు దశాబ్దాల నుంచి అమలులో ఉన్న సర్వీస్ నిబంధనలను ఏకపక్షంగా మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం బోర్డు విభజనకు ముందు అమలులో ఉన్న సర్వీస్ నిబంధనలు, పని ప్రమాణాలు, కారుణ్య నియామకాలు తదితర ప్రయోజనాలు యథావిధిగా కొనసాగుతాయని, ఏవైనా మార్పులు చేయాలంటే ఉద్యోగ సంఘాలతో చర్చించి ప్రస్తుత ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా పరస్పర అవగాహనతో ఒప్పందాలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. అదే విధంగా జీతభత్యాల విషయంలో ప్రస్తుతం అమలులో ఉన్న పరస్పర చర్చల ద్వారా వేతనాలు నిర్ణయించే పద్ధతి ఇకముందు ఏర్పడబోయే సంస్థల్లో కూడా కొనసాగిస్తామని త్రైపాక్షిక ఒప్పందంలో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. కానీ ఇందుకు భిన్నంగా 2022 వేతన సవరణపై నిర్ణయాల కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక మాజీ ఐఏఎస్ అధికారిని నియమించారన్నారు. పూర్వం నుంచి అమలులో ఉన్న 'వెయిటేజ్' ఫార్ములాను రద్దుచేసి, అతి తక్కువ శాతం (8శాతం) ఫిట్మెంట్ బెనిఫిట్‌ను, పాత పద్ధతికి విరుద్ధంగా ఇంక్రిమెంట్లు, మాస్టర్ స్కేలు రూపొందించారని, దీనివల్ల ఉద్యోగులు చాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.



విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న నాయకులు



సమావేశానికి హాజరైన ఉద్యోగులు, కార్మికులు

దశలవారీ ఆందోళనలకు పిలుపు

తమ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగులు దశలవారీ ఆందోళనా కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు విద్యుత్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో అన్ని సర్కిల్ కార్యాలయాల్లో, జనరేటింగ్ స్టేషన్ల వద్ద భోజన విరామ సమయాల్లో ధర్నా, 19, 20 తేదీల్లో సర్కిల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు, 22న అన్ని జిల్లా కేంద్రాల్లో శాంతియుత ర్యాలీ నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. అప్పటికీ తమ సమస్యలు పరిష్కరించకుంటే అన్ని సంఘాల నాయకులతో చర్చించి భవిష్యత్‌లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఎస్.కృష్ణయ్య, కన్వీనర్ రాఘవరెడ్డి, కో కన్వీనర్ కే శేషారెడ్డి, కే శ్రీనివాస్, ఎం.గోపీ, డిస్కమ్ జేఏసీ నేతలు భూక్యా నాగేశ్వరరావు, తురగా రామకృష్ణ, సీహెచ్ సాయిబాబా, జిల్లా నాయకులు ఎం.రమేష్, వీ రాము, అబ్బాస్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు ఎం.బాలకాశీ, కే నాగరాజు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నలుమూలల నుంచి వందలాదిగా ఉద్యోగులు, కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



పోటీల్లో ప్రజంటేషన్ చేస్తున్న విద్యార్థులు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025ను మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకత, వినూత్న ఆలోచనలకు ఈ హ్యాక్‌థాన్ వేదికైంది. ఇంజినీరింగ్ విద్యార్థుల నుంచి ఈ హ్యాకథాన్‌లో 185 జట్లు పాల్గొని 210 ప్రజంటేషన్లు సమర్పించారు. తమ పాఠ్యాంశాలను మించి యాప్‌లను, ఏఐ ఆధారిత వర్క్‌ఫ్లోలను రూపొందించి జ్యూరీని ఆకట్టుకున్నారు. స్మార్ట్ ఎడ్యుకేషన్, మెడ్‌టెక్, వ్యవసాయం, క్లీన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, పునరుత్పాదక ఇంధనాలు, విపత్తు నిర్వహణ వంటి విభిన్న అంశాలపై విద్యార్థులు తమ ప్రజంటేషన్లను సమర్పించారు. వీటిల్లో నుంచి 50 ఉత్తమ జట్లను జ్యూరీ ఎంపిక చేయనుంది. హాకథాన్ పోటీలు బుధవారం కూడా జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో డీన్ ఈఐటీపీ పీ శ్యామ్, శివలాల్, వినోద్, డాక్టర్ దుర్గాబాబు, రాజమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో 'ఉట్టి' ఉత్సవం

ద్వారకాతిరుమల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఉట్ల పండుగ, శ్రీవారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రాజాధిరాజ వాహనంపై ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. తొలుత స్వామివారి కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఉట్టిని యువకులు ఆనందోత్సాహాల నడుమ కొట్టారు. ఉట్టికొట్టిన యువకుడిని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి అభినందించారు. ఆ తరువాత స్థానిక తూర్పు వీధి, పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ఉట్లను యువకులు ఉత్సాహంగా కొట్టారు. ఈ సందర్భంగా తూర్పు వీధిలో పలువురు చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు.



క్షేత్ర పురవీధుల్లో రాజాధిరాజ వాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీవారు





తూర్పు వీధిలో ఉట్టి కొడుతున్న యువకులు, చిన్ని కృష్ణులు, గోపిక వేషధారణలో చిన్నారులు

అక్రమంగా మట్టి నిల్వలు

ఆగిరిపల్లి: టీడీపీ నేతల ఆధ్వర్యంలో మండలంలో మట్టి దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. మూడు నెలల క్రితం పొలాల మెరక కోసమని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అనుమతులు తీసుకున్నారు. కానీ చెరువులోని మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వి మట్టిగుట్టలు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈదులగూడెంలోని ఈము కోళ్ల ఫామ్ ఎదురు రోడ్‌లో వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకొని దానిలో సుమారు 4 వేల ట్రక్కుల మట్టిని అక్రమంగా నిల్వ ఉంచారు. ఈ మట్టి మొత్తం ఇటుక బట్టీలకు తరలించడానికి సిద్ధం చేశారని గ్రామస్తులు తెలిపారు. ఈ మట్టిని ఇటుక బట్టీల వాళ్లకి రూ.50 లక్షలకు బేరం కూడా కుదిరినట్టు సమాచారం. బట్టీలకు మట్టిని తరలించడానికి 2 ఎస్కలేటర్లు, 25 ట్రాక్టర్లను సిద్ధం చేయగా గత వారం రోజుల నుంచి వర్షాలు కురవడంతో మట్టిని తరలించడానికి వీలుపడలేదు. అధికార పార్టీ నాయకులు కావడంతో అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా మట్టి నిల్వలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఈదులగూడెం వ్యవసాయ పొలంలో అక్రమంగా మట్టి నిల్వలు

ప్లాస్టిక్‌తో మత్స్య ఉత్పత్తులకు ముప్పు

ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్త ప్రసాద్

నరసాపురం రూరల్: ప్లాస్టిక్ వినియోగం వల్ల సముద్ర జీవులకు, ఉత్పత్తులకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఫిషరీష్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్త జీవీఏ ప్రసాద్ అన్నారు. మంగళవారం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలోని ఆక్వా యూనివర్సిటీలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశానికి సంబంధించిన వివిధ సముద్ర మత్స్యవనరులు, సముద్రంలోకి వచ్చి చేరిన ప్లాస్టిక్ వ్యర్థాల వలన ఈ వనరులకు కలుగుతున్న నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆక్వా యూనివర్సిటీ ఓఎస్‌డీ టి సుగుణ, మెరైన్ ఇంజినీరింగ్ హెడ్ సి.ధనుంజయ్‌రావు మాట్లాడుతూ సముద్ర జీవులకు ప్లాస్టిక్ వాడకం వలన ముప్పు వాటిల్లుతుందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల సముద్ర మత్స్య వనరులు, తీర ప్రాంత మత్స్య సంపద, మత్స్యరంగ పరిశోధనలో ఫిషరీస్ సర్వేఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) వారు ఉపయోగిస్తున్న వివిధ రకాల పడవలకు సంబంధించిన వివరాలను పోస్టర్ల రూపంలో, వివిధ రకాల వలల నమూనాలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీ రావు, మత్స్య కళాశాల విద్యార్థులు, కళాశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్త ప్రసాద్, ఆక్వా యూనివర్సిటీ ఓయస్‌డీ సుగుణ తదితరులు

కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

తాడేపల్లిగూడెం: తాళ్లముదునూరుపాడు, గూడెం పట్టణంలో మంగళవారం వీధి కుక్కలు చేసిన దాడిలో ఏడుగురికి గాయాలయ్యాయి. ముదునూరుపాడులో రెండు కుక్కలు చేసిన దాడిలో చిన్నారులు గాయపడ్డారు. పెంటపాడుకు చెందిన ఎస్.విజయనాగమల్లేశ్వరరావు, బోడపాడుకు చెందిన బి.దుర్గాప్రసాద్, ముదునూరుపాడుకు చెందిన కే.నరేంద్రరెడ్డి, ఇ.సందీప్, జి.రితీష్, యు.విష్ణుష్ కల్యాణ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గూడెం పట్టణంలో మరో కుక్క దాడి చేసిన ఘటనలో జి.సూర్య అనే యువకుడు గాయపడ్డాడు. వీరిని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వీధుల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నా మునిసిపల్ అధికారులు పట్టనట్టు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.







తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు

నూజివీడు: ఇటీవల అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాగులో ఉన్న ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో నివారణకు చేపట్టాల్సిన చర్యలపై నూజివీడు హెచ్ఓ ఆర్ హేమ రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వీటిని ఆచరించి ఉద్యాన పంటలకు నష్టం కలుగకుండా చూసుకోవాలని ఆమె కోరారు.

మామిడిలో...

ఆకులకు 5 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ని ఒక లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి. కాంటాఫ్ 2ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి తెగుళ్ల రాకుండా పిచికారీ చేయాలి. బోరాన్, జింక్ 2ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఆయిల్ పామ్‌లో...

లేత మొక్కలు ముువ్వ మునిగినట్లయితే బావిస్టిన్ 3 గ్రా లీటరు నీటిలో కలిపి మువ్వలో పోసి మొక్కంతా తడిచేలా పిచికారీ చేయాలి. తోటలో మురుగునీరు బయటకు పంపి 2.5 కేజీల యూరియా, 3.7 కేజీల సింగల్ సూపర్ ఫాస్ఫేట్, 2 కేజీల పొటాష్ , 50 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, 100 గ్రా బోరాన్ ప్రతి మొక్కకు మూడు దఫాలుగా 15–20 రోజుల వ్యవధిలో అందజేయాలి.

కొబ్బరిలో...

కొబ్బరి తోటల్లో వారం రోజుల మించి నీరు నిల్వ ఉన్నట్లయితే ముువ్వ భాగం బాగా తడిచేలా కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఆకులు, గెలలపై 0.1 శాతం పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయాలి. కొబ్బరి తోటలు సాధారణ స్థితికి వచ్చిన వెంటనే ఎరువులు 500 గ్రాముల యూరియా, కేజీ సింగల్ సూపర్ ఫాస్ఫేట్, 1.5 కేజీల పొటాష్ చెట్టుకి ఇవ్వాలి.

కోకోలో...

కోకో తోటల్లో నిలిచిన వరద నీటిని మురుగు కాలువల ద్వారా బయటకు పంపించి విరిగిన కొమ్మలను కత్తిరించి ఒక శాతం బోర్డో మిశ్రమం లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ పేస్టులా పూయాలి. పండు బారిన కోకో మొక్కలకు 13:0:46 లేదా 19:19:19లను 5 గ్రాముల లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎరువులు 100 గ్రాముల నత్రజని, 40 గ్రాముల సూపర్, 140 గ్రాముల పొటాష్ ఒక్కో మొక్కకు వేయాలి.



కోకో పంట

ఆర్ హేమ, నూజివీడు హెచ్ఓ

అరటిలో...

మూడు నెలల కంటే చిన్న వయసు గల మొక్కలు 4–5 రోజుల పాటు 2 నుంచి 3 అడుగుల లోతు నీటిలో మునిగినట్లయితే వేరు కుళ్లి మొక్కలు చనిపోతాయి. అలాగే 6 నెలలు దాటిన తోటలు 5 రోజుల కంటే తక్కువ నీటి ముంపునకు గురైనప్పుడు వేరు వ్యవస్థ పాక్షికంగా దెబ్బతింటుంది. మురుగునీటిని కాలువల ద్వారా బయటకు పంపి తేలికపాటి దుక్కు చేసి మొక్క ఒక్కొంటికి 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల పొటాష్‌ను 20 నుంచి 25 రోజుల వ్యవధిలో 2, 3 దఫాలు వేయాలి. ఆకులకు 5 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ని ఒక లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో 3 సార్లు పిచికారీ చేయాలి. సిగటోక ఆకు మచ్చ తెగులుకు ప్రోపికోనజోల్ ఒక ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. దుంపకుళ్లుకు 25 గ్రాముల బ్లీచింగ్ పొడి ఒక లీటర్ నీటిలో కలిపి మొదలులో పోయాలి. 15 రోజుల వ్యవధిలో 2–3 సార్లు చేయాలి. తర్వాత మొక్క మొదళ్లలో 50 గ్రాములు సూడోమోనాస్ 250 గ్రాముల వేప పిండి కలిపి వేయాలి.



బొప్పాయిలో...

అధిక వర్షాల వలన మొక్కలు పసుపు రంగులోకి మారడం, కాండం కుళ్లు వంటి లక్షణాలు ఉన్నట్లయితే రెడోమిల్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా ఎలైట్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి మొక్క మొదలు పోయాలి. పండు ఈగ ఉధృతి ఎక్కువ ఉన్న యెడల మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరాకు 10 నుంచి 15 ఏర్పాటు చేసుకోవాలి. సూక్ష్మ పోషకాలైన జింక్ సల్ఫేట్ 2.5 గ్రా, బోరాన్ 1 గ్రా, యూరియా 10 గ్రా లీటరు నీటికి కలిపి 20 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.

కూరగాయల్లో...

కూరగాయలపై అధిక వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలు పిచికారీ చేయాలి. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3గ్రా లీటరు నీటికి లేదా మెటలాక్సిల్‌తోపాటు మంకోజెబ్ 2గ్రా లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి. ఆకు మచ్చ తెగుళ్ల నివారణకు కార్బండిజం ఒక గ్రాము లీటరు నీటికి లేదా మంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి, ప్లాంటమైసిన్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

గంటల వ్యవధిలో యువతుల ఆచూకీ గుర్తించిన పోలీసులు

భీమవరం: భీమవరం ఒకటో పట్టణానికి చెందిన ఇద్దరు యువతులు అదృశ్యం కాగా వారి ఆచూకీని గంటల వ్యవధిలో పోలీసులు గుర్తించారు. పట్టణంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్న ఇద్దరు యువతులు ఈ నెల 15న రాత్రి ఇంటికి వెళ్లలేదు. రాత్రి 12.30 గంటలకు యువతుల తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య పర్యవేక్షణలో సీఐ ఎం.నాగరాజు, ఎస్సై బీవై కిరణ్‌కుమార్, సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంతో యువతుల చరవాణి లోకేషన్‌ను గుర్తించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి సమీపంలో ఉన్న ఆ ఇద్దరినీ గుర్తించి పట్టుకుని భీమవరం తీసుకొచ్చి కౌన్సెలింగ్ అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

నరసాపురం ఎంపీ టికెట్ ఇస్తే తిరస్కరించా

ఎంపీ పాక సత్యనారాయణ



తాడేపల్లిగూడెం (టీఓసీ): గత ఎన్నికల్లో బీజేపీ అధిష్టానం తనకు నరసాపురం ఎంపీ టికెట్ ఇస్తే సున్నితంగా తిరస్కరించానని రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ తెలిపారు. మంగళవారం తాడేపల్లిగూడెంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నరసాపురం ఎంపీ సీటు పోటీకి అన్ని పార్టీలు తన పేరును సిఫార్సు చేశాయని చెప్పారు. తనకు రాజ్యసభ సీటు పొందడం కన్నా నరసాపురం లోక్‌సభ సీటుకు అన్ని పార్టీలూ కలిపి తన పేరు చెప్పడం సంతోషం కలిగించిందన్నారు. కార్మిక బోర్డు చైర్మన్ వి.బాబ్జీ, బీజేపీ నేతలు బి.ఆదిలక్ష్మి, పి.అన్నవరం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉంగుటూరు మండలం నాచుగుంటలో జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెచ్ఎఫ్ ప్రో గ్లామర్ కొత్త వెహికల్ లాంచ్



కొత్త వెహికల్ లాంచ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో టూటౌన్‌లోని దానేశ్వరి హీరో షోరూంలో మంగళవారం హెచ్ఎఫ్ ప్రో గ్లామర్ ఎక్స్ కొత్త వెహికల్ 125సీసీ బైక్‌ని లాంచ్ చేశారు. స్థానిక ప్రముఖులు పి.వెంకట్రామయ్య, వై.నాగబాబు వీటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మెకానిక్‌లకు బీఎస్ 6 బైక్‌లపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

పర్యావరణంపై అవగాహన అవసరం



అధికారులతో సమావేశమైన కమిషనర్

తాడేపల్లిగూడెం: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 అంగీకార్ 2025 పై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కమిషనర్ ఎం.ఏసుబాబు కోరారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం, పట్టణ ప్రాంతంలో అర్హులైన వారికి పక్కా గృహాలు మంజూరు, పర్యావరణ గురించి ప్రజల్లో అవగాహన సబ్సిడీ లోన్ స్కీమ్, గృహలోన్ మేళా వంటి విషయాలను కరపత్రాల ద్వారా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సీతారాం, మేనేజర్ ఎం.రవిసుధాకర్, టీపీఓ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

పెంటపాడు: మండలం ముదునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉదయం కేంద్ర ప్రభుత్వం ద్వారా మహిళల ఆరోగ్య రక్షణ కోసం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు వైద్యాధికారిణి పూజిత పేర్కొన్నారు. పలు రకాల ఆరోగ్యపరీక్షలు చేయించే ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఈమె కోరారు.

మాధవరంలో గడ్డిమేటు దగ్ధం



మాధవరం గ్రామంలో దగ్ధమైన గడ్డి కట్టలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన గోపిరెడ్డి దొరబాబుకు చెందిన గడ్డిమేటును సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఐదు వేల నుంచి ఆరు వేల కట్టలు దగ్ధమైనట్లు బాధితుడు దొరబాబు తెలిపారు. వీటి విలువ రూ.7 లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వెల్ఫేర్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను త్వరితగతిని పరిష్కారం చేయాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను కలిసి ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అంకం భాస్కరరావు తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

జట్లపాలెం పాఠశాలలో వర్షం నీరు



జట్లపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో వర్షం నీరు

పెంటపాడు: మండలంలోని జట్లపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో వర్షం నీటితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి పాఠశాలలో వర్షం నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థులు ఆ నీటిలోనే నడుచుకొంటూ పాఠశాలకు వెళ్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పట్టణంలో ఓ వీధిలో వర్షం నీరు



పాతూరులో కాలనీలో నిలిచిన వర్షం నీరు



కాలనీలో డ్రెయిన్లను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు



యాగర్లపల్లిలో భారీ వర్షం

పట్టణంలో కుండపోత వర్షం



మసీద్ సెంటర్‌లో కాలువ తరహాలో నిలిచిన వర్షం నీరు



పశువుల ఆసుపత్రి వద్ద పొంగి పొర్లుతున్న డ్రెయిన్



పట్టణంలోని డ్రెయిన్‌లను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు

- వల్లపు ప్రాంతాలు జలమయం
- వర్షంతో ఇక్కట్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కుండపోత వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. భారీ వర్షానికి అన్ని పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. వర్షం తగ్గుతుందా లేదోనని ప్రజలు, ముఖ్యంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందారు. అయితే మధ్యాహ్నం వరకు అడపా దడపా వర్షం పడుతూనే ఉంది. సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతంగా ఉండటం, వాతావరణం చల్లగా మారింది.

పొంగి పొర్లిన డ్రెయిన్లు

ఇది ఇలా ఉంటే భారీ వర్షానికి డ్రెయిన్‌లు పొంగిపొర్లాయి. డ్రెయిన్‌లలో చెత్త చెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు పూడుకుపోవడంతో నీరు ఎటు వెళ్లలేని పరిస్థితిలలో ఆ డ్రెయిన్ మురుగు నీరు రోడ్లుపైకి చేరాయి. మోకాలు లోతువరకు నీరు నిలిచింది. ఖాళీ స్థలాలు మునిగిపోయాయి. పట్టణంలో ప్రస్తుతం పనిచేస్తున్న మూడు చోట్ల అవుట్‌లెట్లు ఆ నీటిని వేగంగా ఏలూరు కాలువలోకి చేర్చేందుకు వీలు లేకుండా డ్రెయిన్‌లలో అడ్డంకులు ఏర్పడటంతో పారిశుద్ధ్య సిబ్బంది అష్టకష్టాలు పడ్డారు. కొన్ని చోట్ల డ్రెయిన్ నీరు ముందుకు సాగే వీలు లేకపోవడంతో వెనక్కి తన్నడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచి పోయింది. నీటిలోనే ద్విచక్ర వాహనదారులు, కారులు, పాదచారులు ఆయా పనులు నిమిత్తం అటుఇటు తిరిగారు. పాతూరు, కడకట్ల, యాగర్లపల్లి, హౌసింగ్ బోర్డు, సవిత్రుపేట, జువ్వలపాలెం, సత్యవతినగర్, వానపల్లిగూడెం, వీకర్స్‌కాలనీ, దొమ్మర్లకాలనీ, భాగ్యాలక్ష్మిపేట, నవ్వారు పేట, ఇలా అనేక పల్లపు ప్రాంతాలలో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. మునిసిపల్ కార్యాలయం వద్ద, రైల్వేస్టేషన్ రోడ్డు, మసీద్ రోడ్డు, బస్సు కాంప్లెక్స్ ఆవరణ, పలు పల్లపు ప్రాంతాలలోని పాఠశాలల ఆవరణలు, పల్లపు ప్రాంతాలలో ఉన్న సచివాలయాలలో నీరు నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మునిసిపల్ కమిషనర్ యేసుబాబు పర్యటన

పట్టణంలో పల్లపు ప్రాంతాలను, డ్రెయిన్‌లను ఉదయం సమయంలో మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు పర్యటించి పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనేక చోట్లు డ్రెయిన్‌లో వ్యర్థాలను తొలగించారు.

పట్టణంలో రికార్డు స్థాయిలో వర్షం

తాడేపల్లిగూడెం: క్లౌడ్ బరస్ట్ అనే మాట ప్రత్యక్షంగా ఎలా ఉంటుందో పట్టణ ప్రజలు మంగళవారం ఉదయం ఎనిమిది గంటలు కాకుండానే చూశారు. ఆకాశం చిల్లుపడినట్టుగా కుండపోతగా వాన పడింది. ఎడతెరపిలేకుండా కురిసిన వానతో గూడెం తడిసిముద్దయ్యింది. జిల్లాలో అత్యధికంగా వర్షపాతం నమోదయ్యింది. రోడ్లు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలలోకి నీరు చేరింది. ఉదయం ఎనిమిది గంటల వరకు 62.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జిల్లాలో ఇదే అత్యధిక వర్షపాతం. పెంటపాడు మండలంలో 35.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుఅయ్యింది.

గూడెం మండలంలో వ్యవసాయాన్ని పంపుసెట్ల కింద చేసిన పంటలు కోతకు వచ్చాయి. రెండు రోజుల క్రితం వరకు 80 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. మారిన వాతావరణం కారణంగా రెండు రోజులుగా వరికోత యంత్రాలు మూలనపడ్డాయి. పంటలకు, తోటలకు ఎలాంటి నష్టం కలుగలేదు.పంటకు ఎలాంటి నష్టం లేదని వ్యవసాయాధికారులు చెప్పారు.

ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలి



తేతలి హైస్కూలులో విజేతలైన విద్యార్థులతో హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తణుకు మండలం తేతలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట సూర్య వెంకట విశ్వేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ నివాసయోగ్యమైన గ్రహం బూమి ఒక్కటేనని అన్నారు. భూమిపై ఉన్న సకల జీవరాశిని కాపాడుకుంటూ భవిష్యత్ తరాలు కూడా భూమిపై మనుగడ కొనసాగించాలంటే భూమికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్‌పొరను రక్షించుకోవాలని సూచించారు. కాలుష్య నివారణకు సహకరించడంతో పాటు చెట్లు పెంచడం ద్వారా ఓజోన్ పొరను పునరుద్ధరించవచ్చన్నారు. ఓజోన్ పొరపై విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్ కాంపిటీషన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సైంటిఫిక్ మెజిషి యస్ బీఎం గోపాలరెడ్డి, ఉపాధ్యాయులు కె.పుల్లారెడ్డి, సిబ్బంది కార్యదర్శి జె.రాజకుమారి, జి.సుధారాణి, ఎంఎస్ రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో తణుకు మండలం దువ్వ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటి పతకాలు సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి ఆంజనేయులు తెలిపారు. షాట్‌పుట్ విభాగంలో టి. శివ మణికంఠ బంగారు, జావెలిన్ విభాగంలో ఎస్.విజయ్‌కుమార్ రజత, హైజంప్ విభాగంలో టి. మానస కాంస్య, ఫెన్సింగ్ విభాగంలో టి.మేఘన కాంస్య పతకాలు సాధించారని వివరించారు. వీరంతా ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వ్యాయా మ విద్యా ఉపాధ్యాయులు కటికితల బాబురావు, అనిల్‌కుమార్‌లను ఉపాధ్యాయులు అభినందించారు.

20 మంది వృద్ధులకు ఉచిత వైద్యం



తణుకులో ఉచిత వైద్య శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రమేష్‌చంద్రబాబు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు 20 మంది వృద్ధులకు వైద్యసేవలు అందజేశారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు రోగులకు ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి విషయాలపై వైద్యులు అవగాహన కల్పించారు. పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, సభ్యులు ఐవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

కోరం లేక వాయిదా పడిన సర్వసభ్య సమావేశం

పెంటపాడు: పెంటపాడు మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. పెంటపాడు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం పెంటపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా మండలంలోని 19 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను మూడో వంతు సభ్యులు లేకపోవడంతో సభ అర్ధాంతరంగా ముగిసింది. ఈ సమావేశంలో అధికారులు హాజరైనా సభ్యులు లేక వెలవెలబోయింది. కేవలం ఐదుగురు మాత్రమే వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు రావడంతో ప్రారంభించిన కొద్దిసేపటికే ముగిసింది. గతంలో జూన్ 12న సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 90 రోజులు పూర్తైన దృష్ట్యా ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ సమావేశం నిర్వహించి సభ్యులకు సమాచారం అందించారు. ఎంపీపీ దాసరి హైమావతితో పాటు, మరో నలుగురు సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. కాగా మూడో వంతు సభ్యులు లేకపోవడంతో సభ వాయిదాపడింది. ఈ సమావేశంలో అభివృద్ధి, తీర్మానాలు, బడ్జెట్, ఇతర విషయాలు ఏమీ చర్చకురాలేదు.

వర్షంతో రహదారులు ఛిద్రం



ప్రత్తిపాడు గ్రామంలో ఇటీవల ప్యాచ్ వర్కు చేసిన రోడ్లలో వర్షం నీరు నిలిచిన దృశ్యం

పెంటపాడు: వర్షం వల్ల పలు గ్రామీణ రహదారులు చిత్తడిగా మారాయి. ప్రధానంగా ఇటీవల ప్యాచ్ వర్కు చేసిన రహదారులలో గోతులు మరింత పెద్దవయ్యాయి. దీంతో ప్రయాణం చిత్తడిగా మారింది. ప్రధానంగా పెంటపాడు, లోవెల్ కాలువ, కె. పెంటపాడు మిడ్‌లెవిల్ కాలువ గట్లు దెబ్బతిన్నాయి. దర్శిపర్రు నుంచి పెంటపాడు రోడ్డులో ప్రయాణించాలంటే ప్రయాణికులు భయపడే పరిస్థితి నెలకొంది. తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలి



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న మునిస్వామి

తణుకు అర్బన్: విద్యుత్ బస్సులను ప్రభుత్వమే ఆర్టీసీ ద్వారా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా నాయకులు కామన్ మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ తణుకు డిపో మహాసభ మంగళవారం తణుకు అమరవీరుల భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము విద్యుత్ బస్సుల పథకం పేరుతో సబ్సిడీతో కూడిన విద్యుత్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తుందని వీటిని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించకుండా ప్రైవేటు వ్యక్తులకు ఇస్తున్నారని ఇది సరైన విధానం కాదని మునిస్వామి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉచిత బస్సు విధానంతో కార్మికులపై పని భారం పెరిగిందన్నారు. బస్సులు సంఖ్యను పెంచి కార్మికుల సంఖ్యను పెంచకుండా పథకాన్ని అమలు చేయడం ప్రభుత్వ అనాలోచిత విధానమని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీకి 2 వేల ఎకరాలు విలువైన స్థలాలు ఉన్నాయని, వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని ఆలోచనలో పాలకులు ఉన్నారని, ఇందులో భాగంగానే విజయవాడ, విశాఖపట్నం సిటీలోని స్థలాలను లూలు షాపింగ్ మాల్ ఇవ్వడాన్ని రద్దు చేయాలని మునిస్వామి డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా కొమరపూరి సూకరాజు, ఉపాధ్యక్షుడిగా చింతల రామకృష్ణ, తరిపట్ల వెంకట శ్రీనివాసమూర్తి, కార్యదర్శిగా నూతలపాటి శ్రీనివాసు, సహాయ కార్యదర్శులుగా .కొమ్మలకుల గణేష్ నాగ వెంకట సాయి కుమార్, కొండా బత్తుల నాగ వెంకట సూర్యచంద్రరావు, కోశాధికారిగా అనంతపల్లి ప్రసాద్, రామేశ్వరపు నాగ వెంకట దుర్గారావు, ప్రచార కార్యదర్శిగా పేకేటి వెంకట సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

నేలకొరిగిన వరి చేలు



ఇటుకులగుంట, మోదుగ గుంట గ్రామాల్లో నేలకొరిగిన వరి చేలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి చేలు తడిసి తలలు నేలకొరిగాయి. ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, మోదుగగుంట, ఇటుకులగుంట, దండగర్ర తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. పంట చేతికొచ్చిన తరుణంలో కురుస్తున్న వర్షాలతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మంగళవారం ఉదయం వర్షం తెరిపినివ్వడంతో పలు గ్రామాల్లో రైతులు మిషన్లతో కోతలను కొనసాగించారు. అప్పారావుపేట, పుల్లాయగూడెం,మోదుగ గుంట, ఎల్.అగ్రహారం తదితర గ్రామాల్లో వర్షానికి మిషన్లను గట్టుకు చేర్చారు. మరో వారం రోజులు వాతావరణం అనుకూలిస్తే మెట్ట గ్రామాల్లో వరి కోతలు పూర్తవుతాయని రైతులు పేర్కొంటున్నారు. సోమవారం రాత్రి 29.9 అడుగులకు వరద ప్రవాహం చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం వరద ప్రవాహం 29 అడుగుల వద్ద నిలకడగా ఉంది. ఎర్ర కాలువకు పెరుగుతున్న వరద నేపథ్యంలో కాలువ పరీవాహక రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. ఏ క్షణంలో ఎర్ర కాలువ వరద పోటెత్తుతుందోనని మదనపడుతున్నారు.

వర్షాలకు కోతలు నిలుపుదల చేశాం



పంట చేతికి వచ్చిన తరుణంలో వర్షాలు కురవడంతో మిషన్లతో కోతలు కోసే పరిస్థితి లేదు. దీంతో మిషన్లను ఆపేశాం. మరో వారం రోజులు వాతావరణం అనుకూలిస్తే పంట చేతికొస్తుంది. ధాన్యం తడిస్తే ధర పడిపోయే ప్రమాదం ఉంది.

– కొఠారు సూర్యనారాయణ, రైతు, అప్పారావుపేట, తాడేపల్లిగూడెం మండలం

'గూడెం'లో 62.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 62.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ మంగళవారం తెలిపారు. కాగా పెంటపాడు మండలంలో 35.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

18 నుంచి స్వస్త్ నారీ - స్వశక్తి పరివార్ అభియాన్

పెంటపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ నెల 18 నుంచి అక్టోబరు 2వ తేది వరకు స్వస్త్ నారీ - స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీ.వెంకటేష్, టి.సింధు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 18న జగన్నాథపురం-1, 19న జగన్నాథపురం-2, 20 కొత్తూరు, ఆరుగొలను, 22న కృష్ణాయపాలెం, 23న మాధవరం పీహెచ్‌సీ, మోదుగ గుంట, 24న నందమూరు, 25న నవాబుపాలెం, 26న కుంచనపల్లి, 27న మెట్ట ఉప్పరగూడెం, 29న అప్పారావుపేట, అక్టోబరు 1న దండగర్ర గ్రామాల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గూడెం డిపోలో ఆవిర్భావ దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం బస్సు డిపో వద్ద జరిగింది. ఫెడరేషన్ జెండాను మహిళా నాయకురాలు బోడా పెంటమ్మ జెండా ఆవిష్కరణ చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులందరికి ఆరేళ్లగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, ఖాళీగా ఉన్న 10 వేల మంది సిబ్బంది నియామకాలను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయాలని, 12వ పీఆర్‌సీ కమీషన్ వెంటనే నియమించాలన్నారు. ఫెడరేషన్ సెక్రటరీ ఎస్కే రాజశేఖర్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఉద్యోగులపై యాజమాన్యం ఒత్తిడి తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కేవీ రావు, కమిటీ సభ్యులు ఆర్‌వీ ఆంజనేయులు, సీహెచ్ భాస్కర్‌రావు, బహుజన నాయకులు కె.రాజేష్ బాబు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అప్పారావు, వీరన్న, ప్రసాదు, గోవిందు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.